భారతి రచనలు లోతైన పరిశోధనకు తార్కాణాలు



నాంపల్లి: గృహిణిగా ఉంటూనే ఎం.ఎ తెలుగులో బంగారు పతకాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను పొంది ఐదు గ్రంథాలను రచించిన డాక్టర్ పాలుట్ల భారతి కృషిని పలువురు సాహితీవేత్తలు అభినందించి ఘనంగా సన్మానించారు. డాక్టర్ పాలుట్ల భారతి రచించిన 'యుద్ధరంగనాథీయం', 'వ్యాసలతికాభిరామం''స్నిగ్ధారామం ''తాలంకనందినీ పరిణయతారాహోరము', 'తాలాంకనందనీ పరిణయం సమగ్ర పరిశీలన'అనే ఐదు గ్రంథాల ఆవిష్కరణ సభ శనివారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో జరిగింది. నవ సాహితీ ఇంటర్నేషనల్ (చెన్నై) సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభకు పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య టి.కిషన్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాదరావు హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ..భారతి రచనలు లోతైన పరిశోధనకు తార్కాణాలు అని అభివర్ణించారు. భారతి పుస్తకాలను డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్ పరిచయం చేయగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి తాటికొండ రమేష్, పాలెం ప్రాచార్యులు, శ్రీరంగాచార్య, విశ్రాంత తెలుగు శాఖ ఆచార్యులు మొరంగపల్లి బాగయ్య, సీనియర్ పాత్రికేయులు మా శర్మ, సంస్కృతాంధ్ర పండితులు ఎస్.వి.అనంతకృష్ణ పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో పూర్వ విద్యార్థుల బోర్డుల ఏర్పాటు



కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా

గన్‌ఫౌండ్రీ: 137 ఏళ్ల చరిత్ర గల నిజాం కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అన్నారు. శనివారం నిజాం కళాశాలలో కళాశాల పూర్వ విద్యార్థులతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'మీకు తెలుసా'శీర్షికన కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఫొటోలతో కూడిన శాశ్వత బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందరెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎస్.రేణుకా, మహ్మద్ అలీ, బి.తిరుపతి, సీహెచ్ పరందాములు తదితరులు పాల్గొన్నారు.

కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ..

విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు విద్య, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా తెలిపారు. నిజాం కళాశాల సోషయాలజీ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో అందజేస్తున్న వివిధ కోర్సులు, వాటి ప్రత్యేకతలు, ఉపాధి అవకాశాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

మజ్లిస్‌కు ఓటు.. అభివృద్ధికి బాటలు



కార్వాన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్‌కు ఓటు అంటే అభివృద్ధికి బాటలు అని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీ చేస్తున్న మజ్లిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే కాకుండా ప్రజలపై జరిగే దమన ఖాండను ఖండిస్తూ బెస్ట్ పార్లమెంటేరియన్‌గా అసదుద్దీన్ గుర్తింపు పొందారన్నారు. మజ్లిస్ పార్టీకి నేడు తెలంగాణలోనే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా ప్రజల ఆదరణ ఉందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సైతం ప్రభుత్వ వైఫల్యాలను వేలెత్తి చూపుతున్న అసదుద్దీన్ పేద బడుగు వర్గాల అభిమానాన్ని చొరగొన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు మహ్మద్ నసీరుద్దీన్, అజీజ్‌ఖాన్, ముబీన్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు అన్ని వర్గాల ప్రజల మద్దతు



ఎన్నికల ప్రచారంలో మహ్మద్ వలీ వుల్లా సమీర్ తదితరులు

చార్మినార్: హైదరాబాద్‌లో మత రాజకీయాలతో స్థానిక ప్రజలు బేజారుకొచ్చారని..ఈసారి సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి ఇరు వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ వుల్లా సమీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన డబీర్‌పురాలోని పలు బస్తీల్లో పాదయాత్ర ద్వారా ఇంటింటికీ తిరిగి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో సంతృప్తి చెందుతున్న ప్రజలు తమ పార్టీకే ఓటు వేయనున్నారన్నారు. పీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు, చార్మినార్ శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ వుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పేదలకు వైద్యం



మందులను అందజేస్తున్న ప్రభుదత్త మహారాజ్, పద్మజ

జియాగూడ: నిరుపేదలకు ప్రతినెలా రెండు సార్లు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు మందులను కూడా అందజేస్తున్నామని శ్రీ సమర్థ కామధేను గోశాల ప్రతినిధి ప్రభుదత్త మహారాజ్, జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కె.పద్మజ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో జనహిత సేవా ట్రస్ట్ శ్రీ సమర్థ కామధేను గోశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఔషధ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో షుగర్, బీపీ, ఈసీజీ, ఫిజియోథెరపీ మొదలగు పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత ఫౌండర్ ట్రస్టీలు నందకిశోర్, వసుమతి, టి.బాల్‌రాజ్ గుప్తా, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, యువమోర్చా అధ్యక్షులు రాజ్‌పోల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే హైదరాబాద్ పార్లమెంట్‌లో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అభివృద్ధి నినాదంతోనే తాను విజయం సాధిస్తానన్నారు. పదేళ్లపాటు చేపట్టిన అభివృద్ధి తన విజయానికి ప్రధాన ఆయుధమన్నారు. శనివారం గోషామహల్ పరిధిలోని గోడేక్కబార్, చాక్నావాడి, చందన్‌వాడి, షాహినాయత్‌గంజ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ పర్యటించి ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..గత పదేళ్లుగా బీజేపీ, మజ్లిస్ పార్టీలు హైదరాబాద్‌లో ఏ ఒక్క అభివృద్ధి చేయలేదన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. బీఆర్ఎస్‌తోనే గోషామహల్ నలుమూలల కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోడేకబర్ ప్రాంతంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.నరేందర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



వేడుకల్లో ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ. రాములు తదితరులు

గోల్కొండ: సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రానున్న కాలంలో స్వయం ప్రతిపత్తిగల మహిళా యూనివర్సిటీ హోదాను దక్కించుకోవడం ఖాయమని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.రాములు అన్నారు. శనివారం మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో 5వ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడితే ఏదైనా సాధ్యం అని సెయింట్ ఆన్స్ కళాశాల నిరూపించిందన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యను బోధిస్తూ ఎందరో మెరికల లాంటి యువతులను దేశానికి అందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం తన ప్రత్యేకతను చాటుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అత్యుత్తమ ప్రతిభకనబరిచిన 75 మంది విద్యార్థినులకు మెడల్స్ అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రివరెండ్ సిస్టర్ అంబ్రోస్, కళాశాల కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాధేయి, విజయవల్లి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే బీజేపీ ధ్యేయం

హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత



సమావేశంలో మాధవీలతను సత్కరించిన మాణిక్‌ప్రభు



ఉమామహేందర్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న మాధవీలత

అబిడ్స్: రైతుల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి, ప్రగతికి చేసిన సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణా గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమ్మేళనంలో ఆమె ప్రసంగించారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైతులంతా బీజేపీకి ఓటువేసి మజ్లిస్, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలన్నారు. కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. బీజేపీ హయాంలోనే రైతులు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. కనీసం రైతుబంధు కూడా ఇవ్వని కాంగ్రెస్‌ను ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. మజ్లిస్ పార్టీ రైతులకు వ్యతిరేకి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముక్క కృష్ణాగుప్తా, శశికాంత్, కళాకారుడు శ్రీనివాస్‌తో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే ఎంబీటీతో ఎంఐఎం దోస్తీ'

లంగర్‌హౌస్: ఓడిపోతామనే భయంతోనే చిరకాల శత్రువు ఎంబీటీతో కూడా ఎంఐఎం దోస్తీకి సిద్ధమయ్యిందని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలత అన్నారు. లంగర్‌హౌస్ డివిజన్‌లో శుక్రవారం రాత్రి పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముస్లింలను ఫంక్షర్ దుకాణలకు పరిమితం చేస్తూ ఎంఐఎం నేతలు వారిని అభివృద్ధి చెందనీయకుండా అణచివేస్తున్నారన్నారు. మోదీ ఆధ్వర్యంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సాధ్యమన్నారు. త్రిబుల్ తలాక్ చట్టంతో ముస్లిం మహిళలను కాపాడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, బోగి పరమేశ్, నాగేంద్రప్రకాష్ రెడ్డి, వినేష్‌సింగ్ పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీకి ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలి

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధి నిరోధకులుగా మారిని మజ్లిస్ పార్టీకి ఈసారి ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలని హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత పాతబస్తీ ఓటర్లను కోరారు. చార్మినార్ బీజేపీ కన్వీనర్ సురేందర్ ఆధ్వర్యంలో శనివారం మొఘల్‌పురా డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చార్మినార్ బీజేపీ సీనియర్ నాయకుడు టి.ఉమామహేంద్రతో కలిసి ఆమె పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పాతబస్తీలో అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ పాతబస్తీలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అభివృద్ధి చేయించక పోగా.. కొన్ని హిందువుల ఏరియాల్లో కావాలని అభివృద్ధిని నిలిపి వేయించారన్నారు. తాను విజయం సాధిస్తే కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చేయిస్తానన్నారు.

మళ్లీ నన్నే గెలిపించండి: అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: ఈ ఎన్నికల్లో కూడా మళ్లీ తనకే ఓటు వేసి గెలిపించాలని హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాతబస్తీ ఓటర్లను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాతబస్తీలోని భవానీనగర్, మౌలాకాచిల్లా, రెహమత్ నగర్, అమన్‌నగర్ తదితర బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలి నడకన చేతిలో మైక్ పట్టుకుని ఇంటింటికీ తిరిగి ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పాతబస్తీలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. నిజాం కాలం నాటి పైప్‌లైన్ వ్యవస్థను తొలగించి కొత్తగా పైప్‌లైన్ పునరుద్ధరించామన్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు వీధిదీపాల ఏర్పాటు తదితర కనీస సౌకర్యాలను కల్పించామన్నారు.

'బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుంది'



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కిశోర్‌కుమార్ తదితరులు

జియాగూడ: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందని కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హేమంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరం



బాల్‌రాజ్ కాలే

జియాగూడ: జియాగూడలోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో మే 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు చేపడుతున్నట్లు స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కాలే అన్నారు. ఈ మేరకు శనివారం స్కూల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ప్రతి యేటా నిర్వహించినట్లే ఈ సారి కూడా పిల్లలకు డ్యాన్స్, కరాటే, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ లాంగ్వేజెస్, హ్యాండ్ రైటింగ్, చెస్, క్యారమ్స్ తదితరవి ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

సత్యనారాయణరావుకు నివాళి



అబిడ్స్: రాష్ట్ర దివంగత మాజీ మంత్రి సత్యనారాయణరావుకు నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, రాష్ట్ర నాయకులు కుమార్‌రావు, శ్రీనివాస్ గుప్తా, ప్రేమ్‌లాల్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

'హైదరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తా'



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

దూద్‌బౌలి: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పురానాపూల్ డివిజన్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ, మజ్లిస్, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. గత పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని.. అందుకే ఈ ఎన్నికల్లో తన విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీకాంత్, రవీశ్వర్, రాధాకృష్ణ, విజయ్‌కుమార్, అనూష గోపీ గౌడ్, మనీషా అగర్వాల్, సందీప్, నిమ్మగడ్డ రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



ఈటల రాజేందర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సీనియర్ బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. శనివారం సీనియర్ బీజేపీ నాయకుడు, హైదరాబాద్ పార్లమెంట్ క్యాంపెన్ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి విజయం కోసం చేస్తున్న ప్రచారం తదితర వివరాలను ఆయన ఈటల రాజేందర్‌కు వివరించారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనను చూసిన ప్రజలంతా తెలంగాణలో బీజేపీ వైపు నిలుస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ అవినీతి పాలనను ప్రజలు అంతం చేశారన్నారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సైతం ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పుతారని ఆయన పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



సీఎంను సన్మానిస్తున్న తూమ్‌కుంట అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు, గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొత్త కురుమ శివకుమార్, గొరిగే మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. ఈనెల 29న గాంధీభవన్‌లో నిర్వహించే కొల్లూరి మల్లప్ప చిత్రపటం ఆవిష్కరణ ఆహ్వాన పత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 29న గాంధీభవన్‌లో నిర్వహించే కురుమల సమ్మేళనానికి, కొల్లూరు మల్లప్ప చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది కురుమలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక పార్లమెంట్ సీట్లు గెలిపించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ కురుమ, పాండు కురుమ, రవీంద్రనాథ్ కురుమ, ఉమ్మడి రమేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లను రిజెక్ట్ చేయడం బాధాకరం



మాట్లాడుతున్న గీత తదితరులు

గన్‌ఫౌండ్రీ: మల్కాజ్‌గిరి పార్లమెంటరి నామినేషన్ పత్రాల వెరిఫికేషన్‌లో లోపాలను చూపించకుండా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులను రిజక్ట్ చేయడం చాలా బాధాకరమని రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థి గీతా సింగ్ సింధు అన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలో 177 మంది నామినేషన్లు వేయగా అందులో 115 మంది అభ్యర్థులను రిజెక్ట్ చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి కనీసం ఆర్‌ఓ చెక్ చేసుకోవడానికి సమయాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

లష్కర్‌లో దానం నాగేందర్‌దే విజయం



ప్రచారం నిర్వహిస్తున్న సంతోష్‌గుప్తా, మమతా గుప్తా

అబిడ్స్: లష్కర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌దే విజయమని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా గ్రేటర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న దానం నాగేందర్‌వైపే ప్రజలంతా మొగ్గు చూపుతున్నారన్నారు. శనివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించి దానం నాగేందర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. గత ఐదేళ్లుగా ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సికింద్రాబాద్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.

రైతు సమ్మేళనం



గోల్కొండ: బీజేపీ కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా ఆధ్వర్యంలో శనివారం గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో రైతు సమ్మేళనం నిర్వహించారు. అధ్యక్షుడు రావుల మాణిక్‌ప్రభు, కార్యదర్శి ముక్క కృష్ణగుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, దాన్ని వల్ల జరిగిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, నిరంజన్‌రెడ్డి, దేవర శ్రీనివాస్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యాన్ని డంప్ చేసిన వ్యక్తి అరెస్ట్

జియాగూడ: పీడీఎస్ బియ్యంను ఓ వ్యక్తి డంప్ చేసి ఉండగా పట్టుకుని అతని వద్ద నుంచి 550 కిలోల బియ్యాన్ని పట్టుకున్నట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం కార్వాన్‌లోని గిరికపల్లి, దోభీఘాట్ వద్ద గల ఒక రూమ్‌లో రేషన్ బియ్యాన్ని దాచిపెట్టినట్లు సమాచారం లభించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పట్టుకోగ సీజీ బాల్‌రామ్‌లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. గత కొంత కాలంగా రేషన్ బియ్యాన్ని కార్వాన్ పరిసరాల్లో డంప్ చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు.

శభాష్.. ఆశీష్



ఆశీష్‌కుమార్ యాదవ్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

అబిడ్స్: శభాష్ ఆశీష్‌కుమార్ యాదవ్ అంటూ మాజీ మంత్రి, రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనను అభినందించారు. గోషామహల్ నియోజకవర్గంలో ఇటీవల పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రతిరోజూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ పటిష్టతకు ఆశీష్ యాదవ్ చేస్తున్న కృషిని కేటీఆర్ శనివారం అభినందించారు. ఆశీష్‌కుమార్ యాదవ్ నిరంతరం కష్టపడుతూ పార్టీని ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆశీష్‌కుమార్ యాదవ్‌ను కేటీఆర్ అభినందిస్తూ అందరి ముందు ఆశ్చర్యపరిచారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ తరహాలో కష్టపడితే పార్టీ 365 రోజులు రాష్ట్రంలోనే కాక దేశంలో నెంబర్:1 స్థాయిలో ఉంటుందని కేటీఆర్ ప్రశంసించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



లంగర్‌హౌస్: అమ్మవారి నామస్మరణతో లంగర్ హౌస్ మార్కెట్, హరిదాస్‌పుర ప్రాంతాలు మార్మోగాయి. హరిదాస్‌పురలో పురాతన ఊరపోచమ్మ ఆలయాన్ని పునర్ నిర్మించి శుక్రవారానికి 13 ఏళ్లు పూర్తయ్యింది. వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్దయెత్తున అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ పూజల్లో బోగి పరమేష్ కుమార్, బాలరాజు, సర్వేష్ బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో హ్యాక్ ఫెస్ట్–2024



గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హ్యాక్ ఫెస్ట్–2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్‌లోని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లోని 85 కళాశాలలకు చెందిన బృందాలు ఈ హ్యాక్ ఫెస్ట్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారికి ఆయన హ్యాక్ ఫెస్ట్ ప్రాధాన్యతలు, పరిష్కరించడంలో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ నమిలీకొండ, భరద్వాజ్, డాక్టర్ హఫీజ్ భాషా, సేతూశర్మ తదితరులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యా రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం



మహ్మద్ వలీ వుల్లా సమీర్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న దొంతి వినోద్‌కుమార్ గౌడ్

చార్మినార్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, హైదరాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు దొంతి వినోద్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ వుల్లా సమీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాతబస్తీలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసే అంశాలను అభ్యర్థితో చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తమ పార్టీ అభ్యర్థి విజయం కోసం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నామన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ముస్లిం ప్రజలు సైతం సంతృప్తిగా ఉన్నారన్నారు.

మజ్లిస్ పార్టీని గెలిపించండి



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా: మజ్లిస్ అధినేత, ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ శనివారం సాయంత్రం యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తలాబ్‌కట్టా, అమన్‌నగర్–బీ, భవానీనగర్, చాచాగ్యారేజ్, యాకుత్‌పురా, మౌలాకా చీల్లా, బడాబజార్, రైల్వే స్టేషన్, రెయిన్‌బజార్, ఎస్ఆర్‌టీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ మజ్లిస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం రాత్రి రెయిన్‌బజార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ ఆరాఫత్, కార్పొరేటర్లు సమీనా బేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహ్మద్ వసీవుద్దీన్ పాల్గొన్నారు.

14 నుంచి సమ్మర్ ఆర్ట్ క్యాంప్

బహదూర్‌పురా: సాలార్జంగ్ మ్యూజియంలో మే 14 నుంచి 28వ తేదీ వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు సాలార్జంగ్ మ్యూజియం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలుగా ఈ సమ్మర్ ఆర్ట్ క్యాంపు నిర్వహించనున్నమన్నారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనదలచిన విద్యార్థులు ఏప్రిల్ 29 నుంచి మే 5వ తేదీ వరకు మ్యూజియం రిసెప్షన్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 6న ఆర్ట్ క్యాంప్‌నకు ఎంపికైనా విద్యార్థుల లిస్టును విడుదల చేస్తామన్నారు.

అన్న చేతిలో తమ్ముడి హత్య

విజయనగర్‌కాలనీ: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అన్న చేతిలో హత్యకు గురైన ఘటన శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జీ. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ ఫీల్‌ఖానాలో నివసించే మహ్మద్ ఫిరోజ్(28) మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో నుంచి సెల్‌ఫోన్ దొంగిలించి అమ్ముకున్నాడు. ఈ విషయమై అన్నాదమ్ముల మధ్య గొడవ జరిగింది. శనివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో అతడి అన్న మహ్మద్ సయ్యద్(42), అతడి స్నేహితుడు షానావాజ్(36)తో కలిసి ఇనుపరాడ్డుతో మహ్మద్ ఫిరోజ్‌పై దాడి చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఫిరోజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహ్మద్ సయ్యద్, షానావాజ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.